చాలీచాలని జీతంతో
బ్రతుకీడుస్తున్న
ఆ చిరుద్యోగి తన
భార్యకు వైద్యం
చేయించగలిగాడా?

# జలగలు

డా. టి.
రామారావ్
కథ

సాయంత్రం ఐదు గంటలకే ఇల్లొదిలిన గుర్నాథం రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో నీరసంగా ఇల్లు చేరుకున్నాడు.

భర్తకోసమే గుమ్మంలో కూర్చుని ఎదురుచూస్తోన్న వెంకటలక్ష్మి ''ఏమైందండీ?'' అంటూ ఆతురతగా ప్రశ్నించింది భర్తతోపాటు లోపలికి నడుస్తూ.

గుర్నాథం కాళ్లు కడుక్కొచ్చి వంటగదిలోకి నడిచాడు. పీట వేసి కంచం పెట్టి అన్నం వడ్డిస్తూ మళ్లీ అడిగింది వెంకటలక్ష్మి - ''ఏమైందండీ?'' అని.


అన్నం తింటున్నవాడల్లా చటుక్కున తల పైకెత్తి- నీరసంగా నవ్వి భార్య కళ్లల్లోకి చూస్తూ-

ఏమౌతోంది లక్ష్మీ! మనబోటిగాళ్లు ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆపరేషన్ చేయించుకోవాలని ఆశపడడం అత్యాశే అవుతుంది. ఒక ఆస్పత్రిలో ఐదువేలంటే మరో ఆస్పత్రిలో పదివేలనీ ఇలా ఒక్కో ఆస్పత్రిలో ఒక్కో రేటు చెప్పారు. ఈ పోటీ వైద్యానికి మనలాంటివాళ్లు తూగలేరు లక్ష్మీ'' అన్నాడు గుర్నాథం తను చేస్తున్న గుమాస్తా ఉద్యోగాన్ని గుర్తుచేసుకుంటూ.

జాలిగా భర్త కళ్లల్లోకి చూసింది వెంకటలక్ష్మి.

''పోనీలెండి! బాధపడకండి. నేను మొదట్నుంచీ మీకు చెబుతూనే వున్నాను. ఈ ప్రైవేటు ఆసుపత్రులు వద్దండీ బాబూ! మనం తూగలేం అని. అయినా మీరు నా మాట వినిపించుకోలేదు. ఇప్పుడేమైంది. రేప్పొద్దున గవర్నమెంట్ ఆస్పత్రికే వెళదాంలెండి'' అంది భర్తను ఓదార్చాలనే ఉద్దేశంతో.

అన్నం తినడం ముగించుకుని నెమ్మదిగా పక్కమీదికి జేరుకున్నాడు గుర్నాథం. తానుకూడా అన్నం తిని వంటగది సర్దుకుని ఓ అరగంట తర్వాత



భర్త పక్కలోకి జేరుకుంది వెంకటలక్ష్మి.

గుర్నాథానికి నిద్ర రావడంలేదు. జోరీగల్లా బుర్రలో ఆలోచనలు.

తన భార్యకు సంవత్సరంనుండి ఎర్రమైల తెల్లమైల కలగాపులగంగా అవుతుంటే భయపడిపోయి ఓ ఖరీదైన నర్సింగ్‌హోమ్‌లో చూపించాడు.

ఆ పరీక్షలూ ఈ పరీక్షలూ చేసి ఓ వెయ్యి రూపాయల చిలుం వదిలించి ఆఖరికి గర్భసంచి

తీసెయ్యాలనీ, అలా తీసెయ్యకపోతే కాన్సర్ వస్తుందనీ చావుకబురు చల్లగా చెప్పారు అక్కడి డాక్టర్లు.

అంతేకాదు. ఆపరేషన్‌కోసం ఓ పదివేలు సిద్ధం చేసుకోమనీ, సదరు నర్సింగ్‌హోమ్ డాక్టర్లు.

భార్యకు అంత ఖరీదైన ఆసుపత్రిలో పరీక్షలైతే చేయించగలిగాడుగానీ, ఆపరేషన్ చేయించడానికి కొంచెం వెనుకాడాడు గుర్నాథం.

అందుకే మరో చోట ఎక్కడైనా ఇంకాస్త తక్కువలో ఆపరేషన్ జరుగుతుందేమోనని ఓ నాలుగైదు నర్సింగ్‌హోంలు తిరిగి... ఎక్కడా కనీసం ఐదువేలకి తక్కువ లేదని నిర్ధారించుకుని ఆరోజు నీరసంగా ఇల్లు జేరకున్నాడు పాపం గుర్నాథం.

భర్త అలా నిద్రమాని ఆలోచించడం గమనించిన వెంకటలక్ష్మి ''ఏమండీ! ఆలోచించడం మానేసి హాయిగా నిద్రపోండి. రేప్పొద్దున ప్రభుత్వ ఆస్పత్రికి వెళదాం. అక్కడే ఆపరేషన్ చేయించుకోవచ్చు. సరేనా?'' అంది. భర్తకు దుప్పటి కప్పుతూ.

నిజానికి గుర్నాథానికి ప్రభుత్వ ఆస్పత్రులమీద అంతగా సదభిప్రాయం లేదు. అందుకే భార్యకు డబ్బు ఖర్చయినా సరే ప్రైవేటు ఆస్పత్రిలోనే ఆపరేషన్ చేయించుకోవాలని అభిప్రాయపడ్డాడు.

కాని కుటుంబ ఆర్థిక సమస్యల దృష్ట్యా ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఆపరేషన్ చేయించుకోవాలని వెంకటలక్ష్మి అభిప్రాయం.

ఓ అరగంట తర్జనభర్జనల అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలోనే ఆపరేషన్ చేయించుకోవాలని నిర్ణయించుకున్నారు ఆ దంపతులు.

ఆ నిర్ణయానికి రాగానే ఆలోచనలకు స్వస్తిచెప్పి నిద్రకుపక్రమించాడు గుర్నాథం.

ఎప్పుడు నిద్రపట్టిందో తెలీదు.

★ ★ ★

ఉదయం తొమ్మిది గంటలకల్లా ప్రభుత్వ ఆస్పత్రికి రిక్షాలో వెళ్లారు గుర్నాథం దంపతులు. అప్పటికే ఆస్పత్రి తల్లి పొట్ట చీల్చుకుని బయటపడ్డ తేలుపిల్లల్లా కిక్కిరిసిన జనంతో చూడ్డానికి అతి జుగుప్సాకరంగా వుంది.

అయినా తప్పదు. స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్! వెళ్లి ఓపీ చీటీలు రాసేచోట క్యూలో నిలబడ్డాడు గుర్నాథం. తనవంతు వచ్చేసరికి పావుగంట పైనే పట్టింది.

పేరూ - ఊరూ - వయస్సు - జబ్బు అడిగి చీటీ రాసి గుర్నాథంకి ఇస్తూ చేయి చాపాడు చీటీలు రాస్తున్న వ్యక్తి.

అర్థంకాక ''ఏమిటి?'' అని అడిగాడు గుర్నాథం.

''చీటీ రాసినందుకు అర్ధరూపాయి'' నిర్మొహమాటంగా చెప్పాడు చీటీలు రాసే వ్యక్తి. చేసేది లేక అందరూ చదివించుకున్నట్టే తనూ ఓ అర్ధరూపాయి చదివించుకుని ఓపీ చీటీ తీసుకుని గైనిక్ ఓపీ దగ్గరకు వెళ్లారు గుర్నాథం దంపతులు.

గైనిక్ ఓపీ ఇంకా రద్దీగా వుంది.

బైటా లోపలా కిక్కిరిసిన జనం లోపలికి వెళ్లబోతున్న గుర్నాథం దంపతుల్ని గుమ్మంలోనే ఆపేసి ''ఇంకా డాక్టరమ్మగారు రాలేదు. అలా బైటి బెంచీలమీద కూర్చోండి'' అంది ఆయా.

ఉస్సూరుమంటూ వెనక్కి తిరిగి బైట బెంచీమీద కూలబడ్డారు గుర్నాథం దంపతులు.

టైం పది గంటలైంది.

తొమ్మిది గంటలకి రావాల్సిన డాక్టర్లు పది గంటలైనా ఇంకా రాలేదు.

టైం సెన్స్‌లేదు వీళ్లకి!!

మరో అరగంట తర్వాత డాక్టరమ్మగారు వచ్చారు. రోగుల్లో అలజడి బయలుదేరింది.

ఎవరికి వాళ్లే ముందు చూపించుకోవాలనే తాపత్రయంతో తొక్కిసలాట. క్యూలో నిలబడి లోపలికి వెళ్లడం పద్మవ్యూహాన్ని ఛేదించడమే అనిపించింది గుర్నాధానికి. ముందూ వెనుకా అనే తారతమ్యం లేకుండా ముడుపులు తీసుకుని లోపలికి పంపిస్తోన్న ఆయా గుర్నాధం కళ్లలో పడింది.

ముడుపు చెల్లించుకుని భార్యను తీసుకుని లోపలకు అడుగుపెట్టాడు గుర్నాధం.

వెంకటలక్ష్మిని పరీక్ష గదిలోకి పిలవడానికి అరగంటకు పైనే పట్టింది.

పరీక్ష చేసి ''నువ్వు బయట కూర్చో ఏ విషయమూ చెబుతాను'' అని డాక్టరమ్మ గారు చెబితే బయటకు వచ్చి బెంచీమీద కూర్చుంది వెంకటలక్ష్మి.

అరగంట తర్వాత ఆయా వచ్చి గుర్నాథంతో ''మీ ఆవిడకి ఆపరేషన్ పడుతుంది. వెంటనే ఆస్పత్రిలో చేర్చమని డాక్టరమ్మగారు చెప్పారు'' అంటూ గొణగడం ప్రారంభించింది.

ఆమె అవస్థ గుర్నాధానికి అర్థమైపోయింది. అందుకే ''ఎంత?'' అని అడిగాడు.

''వంద'' ఆయా మళ్లీ నసుగుతూ చెప్పింది.

''ఇంద'' అంటూ వందరూపాయలు తీసి ఆమె చేతిలో పెట్టు.

వంద రూపాయలు తీసుకుని లోపలికి వెళ్లిన ఆయా ఓ పావుగంట తర్వాత బయటకు వచ్చి ఓ చీటీ గుర్నాధంకి ఇచ్చి - ''మీ ఆవిడ్ని సెకండ్ యూనిట్‌లో ఎడ్మిట్ చేశారు. డైట్ షీట్ రాయించుకుని వార్డుకి వెళ్లండి'' అంది ఆయా పళ్లికిలిస్తూ.


★ ★ ★

డైట్ షీట్ రాసే చోటకూడా రద్దీగానే వుంది.

క్యూలో నిలబడ్డాడు గుర్నాధం. ఓ అరగంట తర్వాత తన వంతు వచ్చింది. డైట్ షీట్స్‌రాస్తోన్న వ్యక్తి గుర్నాథాన్ని ఎగాదిగా చూసి ''ఓ ముప్పై కొట్టు'' అన్నాడు.

నోరు మూసుకుని ఓ ముప్పై రూపాయలు కొట్టి వివరాలు చెప్పి డైట్ షీట్ తీసుకుని వార్డువైపు నడక ప్రారంభించాడు గుర్నాధం.

అతడ్ని అనుసరించింది అతడి ధర్మపత్ని వెంకటలక్ష్మి. :



★ ★ ★

గైనిక్ వార్డు ముందున్న తల్లీ బిడ్డా బొమ్మ దాటుకుని గేటు దగ్గర కాపలా కాస్తోన్న వాచ్‌మన్‌ని అడిగాడు గుర్నాథం.

గైనిక్ సెకండ్ యూనిట్ కి దారేటు?''

పిచ్చి నాకొడకా! నువ్వు అడిగిన వెంటనే ఎగిరి గంతేసి దారి చెబుతాననుకున్నావుట్రా వెధవా! అన్నట్లు గుర్నాధాన్ని నఖశిఖపర్యంతం చూసి తనకేమీ పట్టనట్లు - అటూ ఇటూ తిరగడం ప్రారంభించాడు వాచ్‌మన్.

మళ్లీ అర్ధమైపోయింది గుర్నాధానికి.

ఓ ఐదు రూపాయలు తీసి వాడి చేతిలో కుక్కాడు.

''ఇలా నేరుగా వెళ్లి అలా ఎడంచేతివైపు మెట్లెక్కి పైకెళ్లి కుడివైపు వార్డులో భాస్కరయ్య అనే ఓ వార్డుబాయ్ వుంటాడు. అతడ్ని అడగండి. అన్నీ అతనే చూసుకుంటాడు'' అంటూ దారి చూపించాడు వాచ్‌మన్.

భార్యను తీసుకుని సెకెండ్ యూనిట్ దగ్గరకు వెళ్లి - భాస్కరయ్యను గురించి వాకబు చేశాడు. అక్కడే వున్న ఓ యాభై సంవత్సరాల వ్యక్తిని. ఆ వ్యక్తి పగలబడి నవ్వుతూ ''నేనయ్యా బాబూ ఆ భాస్కరయ్యని'' అంటూ తనని తాను పరిచయం చేసుకుని ''ఇంతకీ ఏం కావాలి?'' అని అడిగాడు.

వచ్చిన పని చెప్పాడు గుర్నాథం.

''ఓస్. అంతేగదా. మీరేం దిగులు పడకండిసార్! అన్నీ నేను చూసుకుంటాగా. కాకపోతే కొంచెం ఖర్చవుతుంది'' నవ్వుతూ హామీ ఇచ్చాడు భాస్కరయ్య.

''పర్వాలేదు'' గుర్నాధంకూడా భరోసా ఇచ్చాడు.

''అయితే ఇంకేం! మీరేమీ గాబరా పడకండి సార్! నేను చూసుకుంటాను. ఇక్కడ ఒక్కో దానికి ఒక్కో రేటు వుంటుంది. ఫాన్ క్రింద బెడ్ అయితే ఒకరేటు. వరండాలో బెడ్ అయితే ఒక రేటూ, లెట్రిన్ బాత్రూం దగ్గరయితే ఒకరేటూ - నర్సు కూర్చునే చోటుకి దగ్గర్లో బెడ్ అయితే ఒకరేటు ఇలా బెడ్ బెడ్‌కీ ఒక్కో రేటు వుంది. ఈ రేటు వార్డ్ ఇన్‌చార్జి నర్సుకి చదివించుకోవాల్సి వుంటుంది. ఇకపోతే రోజూ బెడ్‌షీట్ మార్చే ఆయాకి ఒకరేటు, రోజూ ఇంజక్షన్లు, మాత్రలు ఇచ్చే నర్సుకి ఒక రేటు రాత్రులు ఎప్పుడు పిలిస్తే అప్పుడు వెంటనే అటెండ్ అవడానికి వార్డు బాయ్‌కీ, ఆయాకీ నైట్ డ్యూటీ నర్సుకీ - ఇంకా ఇంకా...'' ఏదేదో దండకం చదువుకుపోతున్న భాస్కరయ్యని రెక్క పట్టుకుని ''బాబ్బాబూ! నీకు పుణ్యముంటుంది. ఇక ఆపు. అయినా అవన్నీ నాకెందుకు? అన్నీ నువ్వే చూసుకో. అన్నింటికీ హోల్ మొత్తంగా ఎంతవుతుందో చెప్పు ఇచ్చుకుంటాను'' అన్నాడు గుర్నాధం నీరసంగా.

''ప్రస్తుతానికి ఓ రెండొందలు కొట్టండి'' చిద్విలాసంగా చెయ్యి చాపాడు భాస్కరయ్య.

చేసేదిలేక భాస్కరయ్య చేతిలో రెండొందలు కుక్కాడు గుర్నాధం.

ఫలితంగా ఓ అరగంట తర్వాత గిరగిరా తిరుగుతోన్న ఫానుకింద మల్లెపూవులాంటి తెల్లటి దుప్పటి పరిచిన బెడ్‌మీద హాయిగా సెటిలైపోయింది వెంకటలక్ష్మి.

గట్టిగా ఊపిరి తీసుకున్నాడు గుర్నాథం.

★ ★ ★

మరుసటిరోజు -

సెకెండ్ యూనిట్ చీఫ్‌గారైన డాక్టర్ కారుణ్యగారు వెంకటలక్ష్మిని పరీక్షచేసి ఏఏ ఇన్వెస్టిగేషన్స్ చేయించాలో కేస్ షీట్‌లో రాయించి వెంటనే చేయించమని అసిస్టెంట్స్‌కి హుకుం జారీ

చేశారు. ఆ తర్వాత అసిస్టెంట్స్ పీజీలకీ, పీజీలు హౌస్ సర్జన్లకీ - హౌస్ సర్జన్స్ నర్సులకీ - నర్సులు స్టూడెంట్ నర్సులకీ - హుకుంలు జారీ చేశారు.

ఫలితంగా కొత్తగా ట్రైనింగ్‌లో చేరిన ఓ స్టూడెంట్ నర్సు వెంకటలక్ష్మి చేతిని పొడిచి పొడిచి ఎట్టకేలకు ఒక వెయిన్ సెక్యూర్ చేసి బ్లడ్ బాటిల్స్ తీసుసి, లేబిల్స్‌వేసి గుర్నాధం చేతికే ఇచ్చి ''మీరే స్వయంగా లాబ్‌కి తీసుకెళ్లి దగ్గరుండి రిపోర్టులు. పట్రండి. వెళ్లేటప్పుడు యూరిన్‌కూడా ఈ సీసాలో కలెక్ట్ చేసుకొని పట్టుకెళ్లండి'' అంటూ రక్తపు సీసాలతోపాటు ఓ ఖాళీ సీసాకూడా గుర్నాధం చేతిలో పెట్టింది స్టూడెంట్ నర్సు.

లాబొరేటరీకి వెళ్లి తాను తెచ్చిన సీసాలను టెక్నీషియన్‌కి ఇచ్చి వచ్చిన పనిని తాఫీగా చెప్పాడు గుర్నాధం.

గుర్నాధాన్ని ఎగాదిగా చూశాడు టెక్నీషియన్.

''ఆర్డినరీనా? అర్జంటా? యమ అర్జంటా?'' అని కోడ్ భాషలో అడిగాడు.

అర్థం కానట్లు చూశాడుగుర్నాధం.

''ఇలా అయితే ఈ ఆస్పత్రిలో ఎలా బతుకుతావయ్యా మగడా! నేను చెప్పింది అర్థం కాలేదా? ఆర్డినరీ అంటే పదిరూపాయలు, అర్జంటు అంటే ఇరవై రూపాయలు, యమ అర్జంటు అంటే ముప్పై రూపాయలు. ఇక ఇప్పుడు చెప్పు ఏ పద్ధతి కావాలో అంటూ విడమర్చి చెప్పాడు టెక్నీషియన్.

మారు మాట్లాడకుండా ముప్పై రూపాయలు తీసి ముడుపు చెల్లించుకున్నాడు గుర్నాధం.

గుర్నాధాన్ని కూర్చోబెట్టి తీసుకున్న ముడుపుకి ముచ్చటపడిపోతూ యమా అర్జెంట్‌గా రక్తపరీక్షలు, నీరుడు పరీక్షలు చేసి రిపోర్టులు గుర్నాధం చేతిలో పెట్టి గుమ్మంలోకి వచ్చి నిలబడ్డాడు మరో రోగికోసం ఎదురుచూస్తూ - ది గ్రేట్ లేబొరేటరీ టెక్నీషియన్.

★ ★ ★

ఆ మరుసటిరోజు మరో రెండు రిక్విజిషన్స్ రాసి గుర్నాధంకి ఇచ్చి ''ఎక్స్‌రే డిపార్ట్‌మెంట్‌కి మీ ఆవిడ్ని తీసుకువెళ్లి - ఎక్స్‌రే చెస్టూ అబ్డామినల్ స్కానింగూ చేయించుకురండి'' అని చెప్పారు డాక్టర్ కారుణ్యగారు. భార్యను తీసుకుని బయలుదేరాడు గుర్నాధం. ఎక్స్‌రే డిపార్ట్‌మెంట్

## పిసినారి

''నీకు పెళ్లయిన విషయం నాతో చెప్పనే లేదు ఎందుకని?''

''చెప్తే మాత్రం ఏం చేసేవాడివి? పీకలదాకా మెక్కడం మినహా ఒక చిన్న గిఫ్ట్ అయినా పట్టుకురాని పిసినారి మొహం నువ్వూను''

-చింతకింది రవీందర్‌గౌడ్ (మెదక్)



దగ్గర తచ్చట్లాడుతోన్న గుర్నాధాన్ని ఈజీగానే పసిగట్టేశాడు ఓ రేడియాలజీ టెక్నీషియన్.

''ఏమిటి - ఎక్స్‌రేకోసం - స్కానింగ్ కోసం వచ్చారా?'' అనికూడా అడిగేశాడు ఎంతో ఆప్యాయంగా.

అవును - అన్నట్లు తల ఊపాడు గుర్నాధం.

''అయితే ఇచ్చుకో ఓ నూట యాభై రూపాయలు వంద డాక్టర్‌గార్కి- యాభై మా టెక్నీషియన్స్‌కి'' పంపకాల విషయంలో ఎంతో నిజాయితీ ప్రదర్శించాడు సదరు టెక్నీషియన్.

నూట యాభై రూపాయలు చదివించుకున్నాడు గుర్నాధం. అంతే!

ఆఘమేఘాలమీద వెంకటలక్ష్మిని చెస్టు ఎక్స్‌రే అబ్డామినల్ స్కానింగ్ పూర్తయ్యాయి.

డబ్బు పోయినా వెంటనే పనైపోయినందుకు ఎంతో మురిసిపోయాడు గుమాస్తా గుర్నాథం.

★ ★ ★

అన్ని రిపోర్టులూ అయిపోయాయి.

అన్నీ సవ్యంగానే వున్నాయి.

ఆరోజు డాక్టర్ కారుణ్యాగారు గుర్నాధాన్ని పిలిచి ''చూడండి గుర్నాధంగారూ! మీ మిసెస్ రిపోర్టులన్నీ చూశాను. అన్నీ నార్మల్‌గానే వున్నాయి. ఇకపోతే మీ మిసెస్‌కి బ్లడ్ గ్రూపింగ్ చేయించి రెండు బాటిల్స్ బ్లడ్ రిజర్వ్ చేయిచుకొండి. తర్వాత మత్తుమందు డాక్టర్‌గారికి కూడా రిఫర్ చేస్తున్నాను. ఆయనకు కూడా మీ మిసెస్‌ని చూపించి ఫిట్ చేయించుకోండి. ఇక ఆపరేషన్‌కి పోస్టు చేసుకుంటాను'' అని చెప్పారు. ఈ విషయాన్ని భాస్కరయ్యతో చెప్పాడు గుర్నాధం. అతని సహాయాన్ని అర్థించాడు.

వెంకటలక్ష్మిని బ్లడ్ బ్యాంక్‌కి తీసుకువెళ్లి - బ్లడ్ గ్రూప్ చేయించాడు భాస్కరయ్య. బి - ఆర్.హెచ్. పాజిటివ్ బ్లడ్ గ్రూపని తేలిపోయింది. రెండు బాటిల్స్ బ్లడ్‌కూడా ఆఫర్‌లో వుంచమన్నాడు భాస్కరయ్య.

రెండు బాటిల్స్ బ్లడ్‌కిగాను రెండొందల రూపాయలు గుర్నాధం దగ్గర వసూలు చేసి బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసరుగార్కి- ఇప్పించాడు భాస్కరయ్య.

తర్వాత మత్తుమందు డాక్టరు దగ్గరకు తీసుకెళ్లి వెంకటలక్ష్మిని పరీక్ష చేయించాడు.

ఎనెస్థీషియా ఇవ్వడానికి ఫిట్ చేసినందుగ్గాను ముచ్చటగా మూడు వందల రూపాయలు ముడుపు చెల్లించుకున్నాడు గుర్నాధం.

బ్లడ్ బ్యాంకుకీ - మత్తుమందు డాక్టరు దగ్గరికీ తీసుకెళ్లినందుకు భాస్కరయ్యకు ఓ యాభై రూపాయలుకూడా ముడుపు చెల్లించాడు గుర్నాధం.

★ ★ ★

డబ్బులు పోయినా అన్ని పనులు ఇప్పటివరకు సవ్యంగానే జరిగిపోయాయి.

కాని ఎడ్మిట్ అయి వారం రోజులు గడిచిపోతున్నా వెంకటలక్ష్మిని ఇంకా ఆపరేషన్ పోస్టు చేసుకోలేదు డాక్టర్ కారుణ్యాగారు.

ఆ విషయమే అర్థంకాక మళ్లీ భాస్కరయ్య సహాయాన్ని అర్థించాడు గుర్నాధం. విషయం విన్న భాస్కరయ్య ఓసారి శ్రీకృష్ణ భగవానునిలా చిద్విలాసంగా నవ్వి ''ఇందులో అర్థం కాకపోవడానికి ఏముందిసార్! డాక్టర్ కారుణ్యాగారు కత్తి పట్టి ఆపరేషన్ చేయాలంటే కనీసం రెండు వేలైనా అధమం తీసుకుంటారు. మరి మీరేదో గవర్నమెంట్ ఉద్యోగులు కనుక కనీసం ఓ వెయ్యి రూపాయలైనా చెల్లించుకోకపోతే బాగుండదేమో!'' అంటూ అసలు రహస్యాన్ని బయటపెట్టాడు. నిండా మునిగిన తర్వాత చలెందుకు?

రెపరెపలాడుతున్న వంద రూపాయల నోట్లు

ఓ పది తీసి భాస్కరయ్య చేతిలో పెట్టాడు గుర్నాథం.

అంతే! ఆ మరుసటి రోజు ఆపరేషన్ లిస్టులో వెంకటలక్ష్మి పేరు మొదట్లోనే చోటుచేసుకుంది.

★ ★ ★

ఆరోజే వెంకటలక్ష్మికి ఆపరేషన్!

ఆపరేషన్ థియేటర్‌లోకి వెంకటలక్ష్మిని తీసుకువెళ్లేముందు ప్రిపేర్ చేయడానికి నర్సులూ, ఆయాలూ, తోటీలూ ఎంతగానో ఆరాటపడిపోతున్నారు.

డబ్బులివ్వకుండానే అంతలా ఆరాటపడిపోతున్న వాళ్లని చూసి ఆశ్చర్యపోతున్న గుర్నాథం దగ్గరకు ఓ ఆయా వచ్చి మా మామూలు మాకివ్వండి'' అంటూ చెయ్యి చాపింది.

''ఎంత?'' అన్నాడు గుర్నాథం.

''వంద''

వంద రూపాయలూ తీసి ఆయా చేతిలో పెట్టాడు గుర్నాథం.

జగన్నాధుని రథచక్రాల్లా వెంకటలక్ష్మిని పడుకోబెట్టిన స్ట్రెచర్ థియేటర్‌లోకి అడుగుపెట్టింది.

థియేటర్ బయట బెంచీమీద నీరసంగా కూర్చుండిపోయాడు పాపం గుమాస్తా గుర్నాథం.

టైం గడిచిపోతోంది.

పావుగంట...

అరగంట...

గంటా...

ఆలోచనల్తో తలపట్టుక్కూర్చున్న గుర్నాథం దగ్గరకు ఓ ఆయా బిక్కుబిక్కుమంటూ వచ్చింది.

ఈ ఆయా తన దగ్గర వందరూపాయలు వసూలుచేసిన ఆయాకాదు. కొత్త ఆయా!

''మీరేనా వెంకటలక్ష్మి భర్త?'' అడిగింది ఆయా బిక్కుబిక్కుమంటూ.

''అవును''

''సారీ సర్! ఆపరేషన్ టేబిల్‌మీద అధిక రక్తస్రావం జరిగి మీ ఆవిడ చచ్చిపోయింది'' చావు కబురు చల్లగా చెప్పేసి తూనీగలా తుర్రున జారుకుంది ఆయా.

''లక్ష్మీ! లక్ష్మీ''

వెయ్యి బాంబులు ఒక్కసారే పేలిపోయినట్లు పెద్దగా, అతిపెద్దగా ఆపరేషన్ థియేటర్ ముక్కలు

# అగ్రహీరోల ప్రక్కన



అగ్రహీరోల ప్రక్కన నటించాలన్న తపన నేటి మన తెలుగు తారలు తెగ తహతహలాడిపోతున్నారు. ఉదాహరణకు బిగ్‌బాస్ చిత్రంలో రోజా పాత్ర ఎలాంటిదో మనమంతా చూశాం! చక్కని పెర్ఫామెన్స్ ఇవ్వగల నటి రోజ మరి ఎందుకిలాంటి పాత్రలకు ప్రాధాన్యత ఇస్తున్నదా? ఇలా ఒక్క రోజాయే కాదు, చాలామంది హీరోయిన్స్ ఇలానే చేస్తున్నారు. ఇలాంటి పాత్రలు వేయడంవల్ల తాత్కాలికంగా పెద్ద హీరోల సరసన నటించామన్న తృప్తి మిగిలిపోతుందేమో అని, ప్రేక్షకుల గుండెలలో పదికాలాలపాటు నిలిచిపోలేదు. ఈ నగ్నసత్యాన్ని ఇప్పటికైనా తెలుసుకుంటే మంచిది మన హీరోయిన్స్.

— సుబ్బారావు

ముక్కలైపోయేట్టుగా థియేటర్లో వున్న డాక్టర్లూ నర్సులూ, ఆయాలూ, వార్డ్ బాయ్‌లూ, తోటీలూ అందరూ తునాతునకలై నామరూపాలు లేకుండా మాడి మసయిపోయేట్టు భయంకరంగా అరిచాడు గుర్నాథం.

గుర్నాథం అరుపులు ఆ గదిలో ప్రతిధ్వనించాయి.

''ఏమండీ! ఏమిటి? అరుపులు? ఏమైంది? పీడకలగాని వచ్చిందా?'' అంటూ ఎవరో భుజంపట్టి కుదుపుతుంటే ఉలిక్కిపడి లేచి కళ్లు నలువుకుని చుట్టూ కంగారుగా చూశాడు గుర్నాథం.

ఎదురుగా తన భార్య వెంకటలక్ష్మి!

వెంకటలక్ష్మి ముఖంలోకి ఆశ్చర్యంగా చూస్తూ ''నీకేం కాలేదుగదా! నీకేం కాలేదుగదా!'' అంటూ గొణుక్కోసాగాడు గుర్నాథం.

నిద్రలో భర్తకు ఏదో పీడకల వచ్చి వుంటుందని భావించిన వెంకటలక్ష్మి ఓ గ్లాసుడు నీళ్లు తెచ్చి భర్తకు త్రాగించింది.

నీళ్లు గటగటా త్రాగి ''లక్ష్మీ! రేపు గవర్నమెంట్ ఆస్పత్రికి వెళ్లొద్దు. అక్కడ అడుగడుగునా జలగలు... రోగుల రక్తాన్ని పీల్చి పిప్పిచేసే భయంకరమైన రాక్షస జలగలు. వద్దు... వద్దు... ఎంత డబ్బైనా ఫర్వాలేదు. ఎంత అప్పయినా ఫర్వాలేదు. ప్రైవేటు ఆస్పత్రికే వెళదాం. నీ ఆపరేషన్ అక్కడే చేయిస్తాను. అంతే... అంతే!'' కంగారు కంగారుగా అంటోన్న భర్తను చూసి ఆయన అసలలా ఎందుకు అంటున్నాడో అర్థంకాక అర్థం చేసుకోవడానికి ప్రయత్నమూ చేయలేక నిశ్చేష్టురాలై - నిలుచుండిపోయింది వెంకటలక్ష్మి. ★